మందకొడిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్

- ఆన్‌లైన్‌లో నమోదు కాని డీ పట్టా భూముల వివరాలు
- ముందుకు సాగని నమోదు ప్రక్రియ
- రెవెన్యూ, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ రైతన్నల ప్రదక్షిణలు
- పీఎం కిసాన్, పెట్టుబడి రాయితీలు అందవేమోనని ఆందోళన



కనగానపల్లి వ్యవసాయ కార్యాలయంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం వేచిఉన్న రైతులు

కనగానపల్లి: ఆధార్ కార్డు మాదిరిగా రైతులకు విశిష్ట గుర్తింపు కార్డులను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం భూముల వివరాలను ఆన్‌లైన్‌లో (ఫార్మర్ రిజిస్ట్రేషన్) నమోదు చేయిస్తోంది. ఈ ప్రక్రియ వ్యవసాయశాఖ ద్వారా గత నెల రోజుల నుంచి జరుగుతోంది. ఇందులో భాగంగా రాప్తాడు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో స్థానిక ఆర్‌ఎస్కేల వద్ద వ్యవసాయ సిబ్బంది రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అయితే వ్యవసాయ సాగు భూములు ఎక్కువగా ఉన్న కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రాప్తాడు, రామగిరి మండలాల్లో ఈ నమోదు ప్రక్రియ సాఫీగా సాగడం లేదు. ఈ మండలాల్లో సుమారు 65 వేల మంది రైతులు ఉండగా.. ఇప్పటి వరకు 60 శాతం మంది రైతుల పేర్లు కూడా నమోదు కాలేదని తెలుస్తోంది. ఇందుకు ప్రధాన కారణం ఈ ప్రాంతాల్లో రైతులు ఎక్కువగా డీ పట్టా భూములు కలిగి ఉన్నారు. ఈ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయలేదు. వ్యవసాయశాఖ వెబ్‌సైట్‌లో భూముల వివరాలు కనిపించడం లేదని ఆర్‌బీకే సిబ్బంది చెబుతున్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కాని రైతులు ఆర్‌ఎస్‌కేలు, మండల కేంద్రాల్లోని రెవెన్యూ, వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కనగానపల్లి మండలంలో సుమారు 16 వేల మంది రైతులు ఉండగా.. ఇప్పటి వరకు 10 వేల మంది రైతులు కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని వ్యవసాయ సిబ్బంది చెబుతున్నారు. మండలంలోని కనగానపల్లి, కోనాపురం, దాదులూరు, ముక్తాపురం, తూంచర్ల, భానుకోట, కొండపల్లి గ్రామాల్లో చాలా మంది రైతులకు డీ పట్టా భూములు ఉన్నాయి. ఈ రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం ఆర్‌బీకేల వద్దకు వెళ్తే.. మీ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని అధికారులు సమాధానం ఇస్తున్నారు. మీ భూముల వివరాలను పట్టాదారు పాసు పుస్తకంలో కాలమ్-6 నందు నమోదు చేశారని చెబుతున్నారు. వీటిని సవరించడం ఇప్పుడే కాదని.. కొద్ది రోజులు వేచి ఉండాలంటూ అధికారులు సమాధానం ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విశిష్ట గుర్తింపు కార్డుతో ప్రయోజనాలు

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్, పెట్టుబడి రాయితీ, పంట నష్ట పరిహారాలు అందవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు గుర్తింపు కార్డు ఉంటేనే ప్రభుత్వం నుంచి పెట్టుబడి రాయితీలు, బీమా పరిహారాలు, బ్యాంకు రుణాలు అందుతాయని బయట బాగా ప్రచారం జరుగుతోంది. దీంతో భూముల ఆన్‌లైన్ సమస్యతో రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులు రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది చుట్టూ తిరుగుతున్నారు. అయితే అధికారులు మాత్రం ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం ఇంకా చాలా సమయం ఉందని చెబుతున్నారు. కాని గ్రామాల్లో రైతులు మాత్రం ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయినపుడు ప్రభుత్వం ఇచ్చే పరిహారాలు అందకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజులుగా తిరుగుతున్నా..



రైతు గుర్తింపు కార్డు (విశిష్ట సంఖ్య) కోసం పేరు నమోదు చేయించేందుకు కనగానపల్లిలోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్దకు వెళ్లాను. ఆన్‌లైన్‌లో మా భూముల వివరాలు లేవని చెబుతున్నారు. వారం రోజుల నుంచి వ్యవసాయ, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాను.. కాని ఎవరూ సరిగా చెప్పడం లేదు. గుర్తింపు సంఖ్య కోసం మా వివరాలు ఎప్పుడు నమోదు చేస్తారో తెలియడం లేదు. – నారాణయణ, రైతు కనగానపల్లి మండలం

సమస్యలు పరిష్కరించాలి



గత 20 సంవత్సరాల నుంచి మా భూముల్లో పంటలు సాగు చేస్తున్నాం. అయితే రైతు గుర్తింపు కార్డు (విశిష్ట సంఖ్య) కోసం రైతు సేవా కేంద్రాలకు వెళ్తే భూముల వివరాలు ఆన్‌లైన్‌లో చూపించడం లేదని సమాధానం ఇస్తున్నారు. ఈ కార్డు రాకపోతే ప్రభుత్వం వచ్చే పరిహారాలు, రాయితీలు అందవని అధికారులు చెబుతున్నారు. అధికారులు సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి. – ముత్యాలప్ప, కోనాపురం, కనగానపల్లి మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

మండలంలోని అన్ని గ్రామాల్లో ఆర్‌బీకేల వద్ద ఫార్మర్ రిజిస్టేషన్ చేస్తున్నాం. కొన్ని గ్రామాల్లో రైతుల భూముల వివరాలు ఆన్‌లైన్‌లో చూపడం లేదని సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఫార్మర్ రిజిస్టేషన్ మందకొడిగా సాగుతోంది. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడాం. రెవెన్యూ రికార్డుల్లో భూముల వివరాలు సక్రమంగా నమోదు చేస్తే ఈ ఫార్మర్ రిజిస్టేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అవుతుంది.
– కృష్ణ కుమారి, మండల వ్యవసాయాధికారిణి, కనగానపల్లి

రేషన్ కార్డుదారులకు ఈ-కేవైసీ తిప్పలు



ఈ-కేవైసీ కోసం బారులు తీరిన లబ్ధిదారులు



ఈ-కేవైసీ వేసేందుకు ఎండలోనే నిల్చున్న మహిళలు

బత్తలపల్లి: ఈ-కేవైసీ చేయించుకునేందుకు రేషన్ కార్డుదారులకు తిప్పలు తప్పడం లేదు. రేషన్ అందాలంటే ఈనెలాఖరులోపు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మండల వ్యాప్తంగా 12,338 రేషన్‌కార్డులుండగా అందులో 3,535 మంది ఈ-కేవైసీ చేయించాలని పౌరసరఫరాల అధికారులకు జాబితా అందింది.

కిక్కిరిసిన పాఠశాల ప్రాంగణం..

బత్తలపల్లిలో దాదాపు 1,700 మందికి ఈ-కేవైసీ చేయించాల్సి ఉంది. వీరు ఎవరెవరో డీలర్లకు అర్థంకాక మండల కేంద్రంలోని రేషన్‌కార్డులున్న వారందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలంటూ ప్రచారం చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈ-కేవైసీ చేయించుకునేందుకు చౌకధాన్యపు డిపో డీలర్లు ఏర్పాటు చేశారు. దీంతో పెద్దసంఖ్యలో కార్డుదారులు పాఠశాల వద్ద బారులుదీరారు. వీరికి 12 యంత్రాలను ఏర్పాటు చేసి ఈ-కేవైసీ చేయించారు. అయితే లబ్ధిదారులకు ఎండ వేడిమి భరించలేక అల్లాడిపోయారు. తాగునీరు ఏర్పాటు చేసినప్పటికీ శామియానాలు ఏర్పాటు చేయకపోవడంతో ఒకింత అసహనానికి గురయ్యారు. కేవలం 1,700 మందిని గుర్తించలేక ఇలా బత్తలపల్లి వాసులందరినీ ఇబ్బందులకు గురి చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికి తిరిగి వలంటీర్లు లబ్ధిదారులతో ఈ-కేవైసీ చేయించారని, ఇప్పుడు వలంటీర్లు లేకపోవడంతో డీలర్లు వారిని గుర్తించలేక ఇబ్బందులకు కలిగించడం పట్ల లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పుట్టపర్తి టౌన్: ప్రజా సమస్యలపై మంగళవారం తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్ కోరారు. ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి కొత్తచెరువు పలు కాలనీల్లో ధర్నాపై ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లాలో ఆగిపోయిన జగనన్న ఇళ్లు, టిట్కో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి నిరుపేదలకు అప్పగించాలన్నారు. ఎన్నికల హామీ మేరకు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలన్నారు. ఉపాధి కూలీలకు వేతన బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. హంద్రీ-నీవా లైనింగ్ పనులను ఆపడంతోపాటు కాలువ విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. సూపర్‌సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. పై డిమాండ్ల సాధన కోసం తలపెట్టిన ధర్నాకు అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి అంజి, మండల కార్యదర్శి ముత్యాలు, కోశాధికారి వెంకటేష్, నాయకులు నాగరాజు, పవన్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సోయగం

పుట్టపర్తి: హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలతో బుక్కపట్నం చెరువుతోపాటు లోచర్ల, తలమర్ల, మరకుంటపల్లి, మీర్జాపురం చెరువులు నింపుతుండటడంతో ఆయా చెరువుల ఆయకట్టు కింద రైతులు పెద్ద ఎత్తున పంటలు సాగు చేశారు. బుక్కపట్నం చెరువు కిందే దాదాపు 1500 ఎకరాల్లో వరి సాగైంది. ప్రస్తుతం పంట పచ్చదనంతో కళకళలాడుతోంది.



పచ్చదనంతో కళకళలాడుతున్న బుక్కపట్నం చెరువు ఆయకట్టు

భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడవాలి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సకల రాజా

ధర్మవరం: భారతదేశ స్వాతంత్ర సమరయోధులు భగత్‌సింగ్ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సీఐటీయూ నేత ఎస్‌హెచ్ బాషా, మండల కన్వీనర్ జేవీ రమణ, కో-కన్వీనర్లు అయూబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసు నుంచే బ్రిటీష్ వారి పాలనను వ్యతిరేకించిన భగత్‌సింగ్ 23 ఏళ్ల వయసులోనే ఉరికొయ్యను ముద్దాడిన గొప్ప సమరయోధుడన్నారు. సీఐటీయూ నేత హైదర్‌వలి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శ్రీనాథ్, అమన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సకల రాజా తెలిపారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సకల రాజా మాట్లాడుతూ భగత్‌సింగ్ ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో యువకులను సమీకరించి స్వాతంత్ర ఉద్యమంలో వీరోచితమైన పోరాటం చేశారన్నారు. భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి సునిల్, గోవర్ధన్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దేశానికి భగత్‌సింగ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మితతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మహేంద్ర, గణేష్, సుహేల్ తదితరులు పాల్గొన్నారు.

తలుపుల: స్థానిక మూడు రోడ్లకూడలి వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ వర్ధంతిని పురస్కరించుకుని ప్రజా సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎద్దుల రాముడు, అంజిన్ బాబు, ఈశ్వరయ్య, చంద్రశేఖర్, ఎల్వీ రమణ, షామీర్, అంజి, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కేసు నమోదు

గాండ్లపెంట: భూ సమస్యకు సంబంధించి జరిగిన ఘర్షణలో పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. కురుమామిడి పంచాయతీ గుట్టకిందపల్లికి చెందిన పాపిరెడ్డి, గోవిందరెడ్డికి మల్లికార్జున మధ్య కొన్నేళ్లుగా భూ సమస్య ఉంది. ఆదివారం ఇదే విషయమై ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం ఎదుట నిరసన

గాండ్లపెంట: అంగన్‌వాడీ కార్యకర్త తమకొద్దంటూ శనివారం రాత్రి గాజువారిపల్లి తండా వాసులు తండాలోని అంగన్‌వాడీ కేంద్రం ఎదుట నిరసన తెలియజేశారు. వివరాలు.. తండాలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉండగా ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో తండాకు చెందిన 11 మంది దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు ఈనెల 18న తండాకు చెందిన దొరస్వామినాయక్ భార్య శోభారాణిని కార్యకర్తగా నియమించారు. అయితే ఆమె తన విధులకు ఆటంకం కల్గిస్తారనే ఉద్దేశంతో దరఖాస్తుదారుల్లోని ముగ్గురికి నోటీసులు పంపింది. దీనిపై నోటీసులు అందుకున్న వారితోపాటు పలువురు కార్యకర్త చర్యను తప్పుబడుతూ అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిరసన తెలియజేసినట్లు సమాచారం.

వైద్య శిబిరం

ధర్మవరం రూరల్: ధర్మపురి గ్రామంలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 70 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. క్యాంపు కన్వీనర్ డాక్టర్ సత్యనిర్ధారన్, డాక్టర్ సాహిద్, మనోజ్‌కుమార్, రమ్య, నాగరాజు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగేంద్ర, మెహర్‌బాషా నిర్వాహకులు సుజాత పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

కదిరి అర్బన్: పట్టణంలోని షాలిమార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ముస్లిం మతపెద్దలు, ముస్లింలు హాజరయ్యారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి: 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ సువర్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో కేవలం ఎంపీసీ గ్రూపు మాత్రమే ఉందన్నారు.

క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు హర్షణీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: చలివేంద్రం ఏర్పాటు హర్షణీయమని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు, రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు నరేంద్ర రెడ్డి, మానవతా సంస్థ అధ్యక్షుడు చిన్న తంబి చిన్నప్ప తెలిపారు. పట్టణంలోని పీఆర్‌టీవీధిలోనున్న ఆదర్శ గ్రీన్ పార్క్ వద్ద ఆదర్శ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చడం కోసం మినరల్ వాటర్ చలివేంద్రం ఏర్పాటు చేశారన్నారు. ఆదర్శ సేవా సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, గౌరవాధ్యక్షుడు ప్రకాష్, కార్యదర్శి నాగార్జున, నాగభూషణ, మారుతి, నాగరాజు, శ్రీనివాస్, ప్రభాకర్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక మండల మీట్ నిరవధిక వాయిదా

గాండ్లపెంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశాన్ని సభ్యుల కోరం లేకపోవడంతో నిరవధికంగా వాయిదా వేసినట్లు ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి తెలిపారు. కాగా మండల సర్వసభ్య సమావేశాన్ని తొలుత శనివారం నిర్వహించాలని అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఎంపీటీసీ సభ్యుడు ఒకరే హాజరు ఆదివారానికి సమావేశాన్ని వాయిదా వేశారు. అయితే రెండో రోజూ సభ్యులెవరూ హాజరు కాకపోవడంతో సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రకటించారు.

‘ఓర్వలేని తనంతోనే ఆరోపణలు’

ధర్మవరం: సీపీఐలో చేరినప్పటి నుంచి క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేశానని, తనపై ఓర్వలేని తనంతో ఆరోపణలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీపీఐ పార్టీ నిర్వహించే ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. అయితే తనపై ద్వేషంతో కొంతమంది పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించడం బాధాకరమని పేర్కొన్నారు. చేనేతల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

హౌసింగ్ కాలనీ సమస్యలపై రేపు ధర్నా

ఓడీచెరువు: మండల కేంద్రం సమీపంలోని ఆకుతోటపల్లి వద్దగల జగనన్న హౌసింగ్ కాలనీలో పలు సమస్యలను పరిష్కరించాలని మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా తలపెట్టినట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగనన్న కాలనీలో కనీస వసతులు కల్పించాలని, శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు, అమడగూరు, ఓడీచెరువు, నల్లమాడ మండలాల్లోని చెరువులకు హంద్రీ- నీవా ద్వారా నీరు ఇవ్వాలనే తదితర డిమాండ్లతో ధర్నా చేపడుతున్నామన్నారు. రైతులు, ఉపాధికూలీలు, కార్మికులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. సీపీఎం సీనియర్ నాయకులు వీవీ రమణ, మండల కార్యదర్శి కుళ్లాయప్ప, నాయకులు రామిరెడ్డి, రామాంజి, బాషా, నరసింహులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేశవనగర్ శివార్లలో ఆదివారం రాత్రి పోలీసులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.21 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

26న వారపు సంత వేలం

తలుపుల : స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈనెల 26న వారపు సంతలో సుంకం వసూలుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి అనిల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.20 వేలు డిపాజిట్‌తోపాటు రూ.లక్ష సాల్వెంట్ సర్టిఫికెట్ తీసుకొచ్చి వేలంలో పాల్గొనాలని సూచించారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందిస్తున్న సాదత్ అలీఖాన్

కదిరి అర్బన్: రంజాన్ పండుగను పురస్కరించుకుని కదిరి డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన ఇమామ్, మౌజన్లకు ఆదివారం వైఎస్సార్‌సీపీ నేత సాదత్ అలీఖాన్ మదనపల్లి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఖాజీ హాజీ రఫిక్ కార్యాలయంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మజీద్‌లలో పని చేసే ఇమామ్, మౌజన్లు సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎం కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అక్బర్‌ఖాన్, నాయకులు ఇలాహీ, ఫైజ్‌ఖాన్, జిలాన్, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు నష్ట పరిహారం అందించాలి



నాయనపల్లి లో దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత రూపేష్‌రెడ్డి

తాడిమర్రి : నాయనపల్లి, దాడితోట, తురకవారిపల్లి గ్రామాల్లో శనివారం రాత్రి వడగండ్ల వర్షం, ఈదురు గాలులతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత గరుడమ్మగారి రూపేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఆయా గ్రామాల్లోని నేలకు ఒరిగిన అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత రైతులతో మాట్లాడుతూ పంట నష్టపోయిందని తీవ్ర మనోవేదనకు గురి కాకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా ప్రభుత్వంతో పోరాడతామన్నారు. మూడు గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని, అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. అలాగే ఏపీ రైతు సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, మారుతీ ఆయా గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

మహిళల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ విజయకుమార్

పుట్టపర్తి టౌన్: మహిళల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ విజయకుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం ఆయన పుట్టపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఉమెన్ హెల్ప్‌డెస్క్‌తో పాటు రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బందితో పాత, కొత్త కేసుల వివరాలను అడిగి తెలుసుకొని సూచనలు చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వివిధ సమస్యలపై స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. అలాగే క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేకూర్చాలన్నారు. గ్రామాల్లో కార్డన్ సెర్చ్‌లు, పల్లె నిద్ర కార్యక్రమాలు చేపట్టి ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. రౌడీషీటర్లపై నిఘా ఉంచి గ్రామాల్లో గొడవలు జరగకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐ బీ.ఎస్ సరేష్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

‘మమ్మల్ని ఎవరూ కిడ్నాప్ చేయలేదు’

గాండ్లపెంట: తమను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, తమ కుమార్తెకు ఆరోగ్యం బాగా లేక బయట ఉన్నామని సామాలగొంది ఎంపీటీసీ లక్ష్మీదేవి, ఆమె భర్త గోపాల్‌నాయక్ తెలిపారు. ఈమేరకు వారు ఆదివారం రాత్రి వీడియో విడుదల చేశారు. తాము క్షేమంగా ఉన్నామని, ఈనెల 27 జరిగే ఎంపీపీ ఎన్నికకు హాజరవుతామని పేర్కొన్నారు. తమను కిడ్నాప్ చేశారని ఎవరో ఇచ్చిన ఫిర్యాదును తీసుకోవద్దని, ఎవరి మీద కేసులు పెట్టొద్దని పోలీసుల అధికారులను కోరారు.

కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 79 మందికి కంటి పరీక్షలు చేయగా 56 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ తెలిపారు. బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు వారికి ఆపరేషన్లు చేస్తారన్నారు. అనంతరం వైద్యులు, దాతలను శాలువాలతో సత్కరించారు. రోటరీక్లబ్ కార్యదర్శి నాగభూషణ, ట్రెజరర్ సుదర్శన్‌గుప్త, సభ్యులు సత్రసాల ప్రసన్నకుమార్, శివయ్య, రామకృష్ణ, బండారు వెంకటచలం, కృష్ణమూర్తి, శ్రీనివాసరెడ్డి, మనోహర్‌గుప్త, విజయ్‌కుమార్, శ్రీనివాసరావ తదితరులు పాల్గొన్నారు.